

చీనీ టన్ను రూ.39 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.39 వేలు, కనిష్టం రూ.15 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



వర్షసూచన

రాగల మూడు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. 'నైరుతి' ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.



జిల్లాలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జెడ్పీలో ఇద్దరి డిప్యుటేషన్ల రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- మళ్లీ డిప్యూటీ పగ్గాలు లలితకు అప్పగిస్తూ ఆదేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్‌లో ఇద్దరు ముఖ్య అధికారుల డిప్యుటేషన్లు రద్దయ్యాయి. ఇన్‌చార్జ్ డిప్యూటీ సీఈఓగా పని చేసిన రమణారెడ్డి డిప్యూటేషన్ రద్దు కాగా, గుంతకల్లు డీఎల్‌డీఓగా వ్యవహరించిన లలితాబాయి డిప్యూటేషన్ కూడా రద్దయింది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్.వి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే రమణారెడ్డి సెలవులో వెళ్లిపోగా, లలితాబాయి డిప్యూటీ పగ్గాలు చేపట్టనున్నారు.


పాలకవర్గ సభ్యుల తిరుగుబాటుతో..

జెడ్పీ డిప్యూటీ సీఈఓగా పని చేసిన లలితాబాయిని బదిలీ చేసే వరకు తాము స్థాయీ సంఘాలతో పాటు సర్వ సభ్య సమావేశాలకు వచ్చేది లేదని జెడ్పీ పాలకవర్గ సభ్యులంతా గతంలో నిరసన తెలిపారు. సమావేశాలను మూకుమ్మడిగా బహిష్కరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు స్థాయీ సంఘాలు, సర్వసభ్య సమావేశాలు నిర్వహించలేదు. ఈ క్రమంలో లలితాబాయిని గుంతకల్లు డీఎల్‌డీఓగా డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ, ఆమె స్థానంలో డ్వామాలో పని చేస్తున్న రమణారెడ్డిని నియమించారు. అయితే లలితాబాయి గుంతకల్లుకు వెళ్లకుండా జెడ్పీలోనే తిష్ట వేశారు. ఈ అంశానికి సంబంధించి పంచాయతీరాజ్ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి పాలకవర్గ సభ్యులు ఫిర్యాదులు కూడా పంపారు. ఎన్నికల కోడ్ సాకుతో ఈ అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.

కోడ్ ముగియడంతో..

తమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని అటు రమణారెడ్డి, ఇటు లలితాబాయి ఇద్దరూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించుకున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగియడంతో కలెక్టర్ ఇప్పుడు వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని డిప్యూటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రమణారెడ్డిని డిప్యూటీ సీఈఓగా రిలీవ్ చేయాలని సీఈఓ వైఖోమ్ నిదియాదేవికి సూచించారు. అయితే, డిప్యూటీ సీఈఓగా లలితాబాయి బాధ్యతలు చేపట్టాక స్థాయీ సంఘాలు, జెడ్పీ సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తే.. సభ్యులు హాజరవుతారా లేదా అనే అంశం ఇప్పుడు జెడ్పీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఉద్యానం.. లాభాలు ఘనం



ఈ చిత్రంలోని రైతు పేరు ఓబిరెడ్డి. స్వగ్రామం బుక్కపట్నం. 20 ఏళ్లుగా ఐదు ఎకరాల్లో మామిడి తోట సాగు చేస్తున్నాడు. ఈసారి అధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో మందులు పిచికారీ చేయడం, కలుపు తీయించడం, కొమ్మలు కత్తిరించడం వంటి పనులు చేపట్టాడు. దీంతో దిగుబడి బాగా వచ్చింది. మార్కెట్‌లో మామిడి టన్ను రూ.60 వేల నుంచి రూ. లక్ష వరకూ పలికింది. ఈ ఏడాది చాలా మంది రైతుల తోటల్లో పిందెలు రాలిపోయాయి. దీంతో మార్కెట్‌లోకి సరుకు తక్కువగా రావడంతో మంచి ధర దక్కింది. ఈ క్రమంలోనే ఓబిరెడ్డికి ఏకంగా రూ.15 లక్షల వరకూ ఆదాయం వచ్చింది. గతంలో ఎప్పుడూ ఇంత ధర చూడలేదని రైతు ఓబిరెడ్డి ఆనందంగా చెబుతున్నారు.



దోసతో రూ.10 లక్షల ఆదాయం



ఈ ఏడాది నేను నాలుగు ఎకరాల్లో దోస పంట సాగు చేశాను. దిగుబడితో పాటు ధర కూడా ఆశించినంత దానికంటే ఎక్కువే వచ్చింది. ఖర్చులు పోనూ రూ.10 లక్షలకుపైగా ఆదాయం వచ్చింది. ముఖ్యంగా రంజాన్ మాసంలో దోసకు మంచి ధరలు లభించాయి. టన్ను రూ.50 వేల వరకూ పలికింది. వ్యాపారులు తోట వద్దకే వచ్చి పంట కొనుగోలు చేశారు.

– దివాకర్‌రెడ్డి, ఎనుములపల్లి, పుట్టపర్తి



పుట్టపర్తి వద్ద విరగ్గాసిన మామిడి తోట

- జిల్లాలో పెరిగిన ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం
- దిగుబడి తగ్గినా...మార్కెట్‌లో ఆశించిన ధరలు
- ఇతర రాష్ట్రాలకూ పంట ఉత్పత్తుల ఎగుమతి
- లాభాల పంటతో రైతు ఇంట సంతోషం

అనుకూల వాతావరణం...ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు... నీటి లభ్యత పెరగడం వెరసి ఉద్యానపంటలకు పేరుగాంచిన శ్రీసత్యసాయిజిల్లాలో ఏటికేడు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈసారి కూడా ఉద్యాన పంటలు రైతులకు సిరులు కురిపించాయి. దిగుబడులు తగ్గినా...మార్కెట్‌లో ఆశించిన మేర కంటే ఎక్కువ ధర లభించడంతో రైతు మోము ఆనందంతో వెలిగిపోతోంది.

పుట్టపర్తి అర్బన్: ఉద్యాన పంటలు రైతులకు లాభాల తీపిని పంచాయి. ఐదేళ్లు సమృద్ధిగా వర్షాలు కురవడంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహమూ తోడు కావడంతో రైతులంతా ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపారు. గతంతో పోలిస్తే ఈసారి ఉత్పత్తులకు మంచి ధరలు లభించడంతో లక్ష్మీదేవి రైతు తలుపు తట్టింది. దీంతో మరికొందరు రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తున్నారు.

మేలు చేస్తున్న 'ఉపాధి' పథకం


డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద ఉద్యాన పంటలకు 'ఉపాధి' ఎంతో మేలు చేస్తోంది. మొక్కల కొలుగోలు, సంరక్షణ, ఇతర ఖర్చులకు అండగా నిలుస్తోంది. ఫలితంగా జిల్లాలో రైతులు ఎక్కువ మంది 'ఉపాధి' పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ మామిడి, దానిమ్మ, చీనీ, సపోట, అరటి,బొప్పాయి, అల్ల నేరేడు, జామ తదితర పండ్ల తోటల సాగు చేపట్టారు. అలాగే దోస, కళింగర వంటి పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులంతా లాభాలు గడిస్తుండటంతో మరికొంత మంది ఉద్యాన పంటలను సాగుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద 15 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

20 వేల హెక్టార్లలో విస్తరించిన మామిడి

జిల్లా రైతులు దాదాపు 43 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేశారు. ఇందులో అధికంగా 20 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఆ తర్వాత నారింజ, చీనీ 13,900 హెక్టార్లు, దానిమ్మ 2,450 హెక్టార్లు, జామ 516 హెక్టార్లు, బొప్పాయి 950 హెక్టార్లు, అల్ల నేరేడు 430 హెక్టార్లు, ద్రాక్ష 147 హెక్టార్లు, అరటి 1,750 హెక్టార్లు, నిమ్మ 143 హెక్టార్లు, సపోట 254 హెక్టార్లు, దోస, కళింగర 1,840 హెక్టార్లు, సీతాఫలం 78 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇతర ఉద్యాన పంటలు కూడా 466 హెక్టార్లలో సాగులో ఉన్నాయి. ఈ ఏడాది ఉద్యాన పంటల దిగుబడులు 7,53,850 మెట్రిక్ టన్నులకు చేరాయి. చాలా మంది రైతులు పంట ఉత్పత్తులను బెంగళూరు, చెన్నైకి తరలిస్తున్నారు. మరికొంతమంది రైతులు మాత్రం తోటల వద్దకు వచ్చే వ్యాపారులకే పంటలు విక్రయిస్తున్నారు.

ధరల పెరుగుదలతో గిట్టుబాటు

ఈ ఏడాది ఉద్యాన పంటల్లో దిగుబడులు తగ్గినా, ధర మాత్రం ఆశించిన మేర లభించింది. మామిడి రకాన్ని బట్టి టన్ను రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకూ పలికింది. బొప్పాయి టన్ను రూ.30 వేలకుపైగా పలికింది. దానిమ్మ కిలో రూ.200పైనే ధర పలుకుతోంది. చీనీ టన్ను 40 వేలు, దోస, కళింగర టన్ను రూ.40 వేలు, అల్లనేరేడు కిలో రూ.100 నుంచి రూ. 120 వరకూ పలుకుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కదిరి మండలం రామాపురం వద్ద విరగ్గాసిన బొప్పాయి

43 వేల హెక్టార్లు
జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం

7,53,850 మెట్రిక్ టన్నులు
ఉద్యాన రైతులు సాధించిన దిగుబడులు

15 వేల హెక్టార్లు
'ఉపాధి' ద్వారా సాగులోకి రానున్న ఉద్యాన పంటల విస్తీర్ణం

జిల్లాలో అనుకూల వాతావరణం



ఉద్యాన తోటల సాగుకు జిల్లాలో అనుకూల వాతావరణం ఉంది. తోటలకు సకాలంలో ఎరువులు, మందులు పిచికారీ చేసి కాపాడుకోవాలి. అప్పుడే మంచి దిగుబడులు సాధ్యమవుతాయి. డిమాండ్ మేరకు ఉద్యాన ఉత్పత్తులు మార్కెట్‌లోకి రావడంతో ఈ ఏడాది ధరలు బాగా పెరిగాయి. నీటి లభ్యత ఉన్న రైతులు ఉద్యాన తోటలను సాగు చేసుకోవచ్చు. 'ఉపాధి' పథకం ద్వారా రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు అందజేయడంతో పాటు సంరక్షణకు, ఇతర ఖర్చులకూ బిల్లులు చెల్లిస్తారు.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

స్థల వివాదంతోనే సంపత్ హత్య

- ఎన్‌ఎస్‌యూఐ నేత సంపత్‌కుమార్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఐదుగురు నిందితుల అరెస్టు... రూ.7 లక్షల నగదు, కత్తులు స్వాధీనం
- కర్ణాటకలో హత్య చేసి మృతదేహాన్ని ధర్మవరం చెరువు వద్ద పడేసిన వైనం
- రూ.55 లక్షలకు సుపారీ... రూ.15 లక్షలు నిందితులకు అందజేత



స్వాధీనం చేసుకున్న నగదు, కత్తులు, కొడవళ్లు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: ఓ స్థలం విషయంలో నెలకొన్న వివాదంతోనే ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ హత్యకు గురైనట్లు పోలీసులు తేల్చారు. మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడారు. ఎన్‌ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి, న్యాయవాది సంపత్‌కుమార్ హత్య కేసు పూర్వాపరాలను వివరించారు. వారు తెలిపిన వివరాల మేరకు... హిందూపురంలోని న్యాయవాది కృష్ణారెడ్డి ఇంటి ముందు ఓ ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం విషయంలో న్యాయవాది కృష్ణారెడ్డి హిందూపురానికే చెందిన శ్రీకాంత్‌రెడ్డి మధ్య విభేదాలు ఉన్నాయి. ఈక్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తన స్నేహితుడైన ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, న్యాయవాది సంపత్‌కుమార్‌ను సాయం కోరాడు. దీంతో స్థల వివాదంలో జోక్యం చేసుకున్న సంపత్‌కుమార్ పలుమార్లు న్యాయవాది కృష్ణారెడ్డితో గొడవ పడ్డాడు. ఇరువురూ పోలీసుస్టేషన్‌లో పరస్పరం కేసులు కూడా పెట్టుకున్నారు.

అడ్డు తొలగించుకోవాలని...

శ్రీకాంత్‌రెడ్డితో పెద్దగా ఇబ్బంది లేకున్నా...అతని స్నేహితుడైన సంపత్‌కుమార్ తమను ఇబ్బందులు పెడుతున్నాడని న్యాయవాది కృష్ణారెడ్డి భావించాడు. ఈ క్రమంలోనే సంపత్‌కుమార్‌ను అడ్డుతొలగించాలని భావించాడు. ఇందుకోసం ముదిరెడ్డిపల్లికి చెందిన సెటిల్‌మెంట్ రామాంజిని సంప్రదించాడు. దీంతో రామాంజి తన అనుచరులు ధర్మవరం సిద్ధయ్యగుట్టకు చెందిన రంగం రవీంద్ర (ప్రస్తుతం హిందూపురంలో నివాసం), హిందూపురానికే చెందిన భుమా లోకేష్, కావలి శ్రీకాంత్, జంపుల శ్రీనివాసులునాయుడులతో కలిసి మే 26వ తేదీన న్యాయవాది కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ కృష్ణారెడ్డి, అతని కుమారుడు నాగార్జునరెడ్డి ... సెటిల్‌మెంట్ రామాంజితో మాట్లాడారు. సంపత్ కుమార్‌ను హత్య చేయాలని కోరారు. ఇందుకు రూ.55 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. అడ్వాన్స్‌గా రామాంజికి రూ.5 లక్షలు ఇచ్చారు.

బీర్లు తాగేందుకు వెళ్దామని చెప్పి...

ఎన్నికల నేపథ్యంలో కేరళ వెళ్లిన సంపత్‌కుమార్ మే 28న హిందూపురం వచ్చాడు. దీంతో సెటిల్‌మెంట్ రామాంజి వెంటనే సంపత్‌కుమార్ హత్యకు పథకం వేశాడు. ఈ క్రమంలోనే గత నెల 29న కదిరికి వెళ్తున్నానని, కారు ఇవ్వాలని తన స్నేహితుడితో తీసుకున్నాడు. అనంతరం శ్రీనివాసులు, రవీంద్ర, లోకేష్, శ్రీకాంత్‌లతో కలిసి సంపత్‌కుమార్ కోసం హిందూపురంలో కాపుకాశారు. రాత్రి 10 గంటల సమయంలో నడుచుకుంటూ వస్తున్న సంపత్ కుమార్‌తో రామాంజి గ్యాంగ్ మాట కలిపింది. గ్యాంగ్‌లోని శ్రీకాంత్‌కు గతంలోనే సంపత్‌తో పరిచయం ఉండటం వల్ల అతను కూడా వారితో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ క్రమంలోనే బీర్లు తాగేందుకు కర్ణాటకకు వెళ్దామని వారంతా కోరగా సంపత్‌కుమార్ అంగీకరించాడు. దీంతో అందరూ కలిసి కారులో కర్ణాటక రాష్ట్రం చింతలపల్లికి పోయే తారురోడ్డు పక్కన ఉన్న కాలువ దగ్గరకు వెళ్లారు. అక్కడ బీర్లు తాగారు. అదే సమయంలోనే ఖాళీ బీరు సీసాలతో మత్తులో ఉన్న సంపత్‌కుమార్‌ను పొడిచారు. అనంతరం వారి వెంట తెచ్చుకున్న బాకులు, కత్తులు, కొడవళ్లతో హత్య చేశారు. అనంతరం సంపత్‌కుమార్ మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని ధర్మవరం చెరువు రెండో మరువ వద్దకు వచ్చి కంపచెట్లలో పడేసి వెళ్లిపోయారు. మే 30వ తేదీ ఉదయం న్యాయవాది కృష్ణారెడ్డి క్లర్క్ నరేంద్ర అనంతపురంలో రామాంజి గ్యాంగ్‌కు మరో రూ.10 లక్షలు నగదు అందించాడు. దీంతో వారు అనంతపురంలోనే కారు వదిలేసి పరారయ్యారు. సంపత్‌కుమార్ తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్యతో సంబంధం ఉన్న సెటిల్‌మెంట్ రామాంజి, అతని అనుచరులు శ్రీనివాసులు, రవీంద్ర, లోకేష్, శ్రీకాంత్‌లను మంగళవారం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7 లక్షలతో పాటు హత్యకు ఉపయోగించిన కత్తులు, కొడవళ్లు, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. హత్య కేసును ఛేదించిన డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సుబ్రహ్మణ్యం, హిందూపురం వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

కదిరి వ్యవసాయ శాస్త్రవేత్తకు పదోన్నతి



కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్‌ను పదోన్నతిపై గుంటూరులోని వ్యవసాయ విశ్వ విద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా నియమించారు. ఈ మేరకు వర్సిటీ వైస్ చాన్సలర్ శారదాజయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం ఆయన వర్సిటీలో బాధ్యతలు స్వీకరించనున్నారు. కొన్నేళ్లుగా పరిశోధనా స్థానం అధిపతిగా ఆయన విశేష సేవలు అందించారు. వేరుశనగ అధిక దిగుబడికి ఆయన చేసిన పరిశోధనలు దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. దీంతో కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానానికి జాతీయ అవార్డు కూడా దక్కింది. ఉత్తమ సేవలకుగాను జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు కూడా అందుకున్నారు.

అద్వితీయం..దివ్యతేజం

- ఏపీ ఈఏపీసెట్‌లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు
- తలుపులకు చెందిన దివ్యతేజకు రెండో ర్యాంకు
- 78వ ర్యాంకుతో మెరిసిన పోరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి



కిషన్ (348వ ర్యాంకు)



భూమిక (360వ ర్యాంకు)



కుశ్వంత్‌కుమార్ (369వ ర్యాంకు)



విశాల్ కుమార్ (521వ ర్యాంకు)

పుట్టపర్తి/తలుపుల/ముదిగుబ్బ: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీసెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో తలుపుల బలిజపేటకు చెందిన టీచర్ రాంప్రసాద్ కుమార్తె పూల దివ్యతేజ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. దీంతో కుటుంబీకులు, బంధువులు దివ్యతేజను అభినందనలతో ముంచెత్తారు. తలుపులకు పేరు తెచ్చావంటూ అభినందించారు. అలాగే హిందూపురం పట్టణానికి చెందిన కిషన్ 348 ర్యాంకు సాధించాడు. మొత్తం 78.3970 మార్కులతో జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు. ముదిగుబ్బకు చెందిన ఉపాధ్యాయుడు చితంబర్‌రెడ్డి, శైలజ దంపతుల కుమార్తె బి.భూమిక 360వ ర్యాంకు కైవసం చేసుకుంది. నీట్ ఫలితాల్లోనూ భూమిక 696 మార్కులతో (ఓపెన్ కేటగిరీలో 1,393వ ర్యాంకు) ఆలిండియాలో 2,653 ర్యాంకు సాధించింది. తాజాగా ఏపీ ఈఏపీసెట్‌లోనూ రాణించి ప్రశంసలు పొందింది. ధర్మవరానికి చెందిన కుశ్వంత్‌కుమార్ 77.9929 మార్కులతో 369 ర్యాంకు, విశాల్‌కుమార్ 75.5813 మార్కులతో 521, తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన చిగిచెర్ల మేఘన 73.3038 మార్కులతో 724, తలుపుల మండలం రాజనాలపల్లికి చెందిన హేమంత్‌కుమార్ 72.3829 మార్కులతో 827, హిందూపురం మండలం పూలకుంట్లకు చెందిన గగన్ శ్యామ్‌రెడ్డి 72.0200 మార్కులతో 875, ధర్మవరం మండలం కుణతూరుకు చెందిన విష్ణువర్ధన్‌గౌడ్ 70.2618 మార్కులతో 1,132, చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన చిగిచర్ల జతిన్ 70.0534 మార్కులతో 1,172, ముదిగుబ్బ మండలం ముక్తాపురానికి చెందిన అవినాశ్ 69.9196 మార్కులతో 1,194, పరిగి మండలం విద్యానగర్‌కు చెందిన కాకర్ల రవిచంద్ర 69.1636 మార్కులతో 1,376 ర్యాంకు సాధించారు. అలాగే నల్లచెర్లోపల్లికి చెందిన తిరుపతి నాయుడు కుమారుడు అవినాష్ ఏపీఈఏపీసెట్‌లో 1,194వ ర్యాంకు సాధించాడు. మెరుగైన ర్యాంకులు దక్కించుకున్న విద్యార్థులను తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.



దివ్యతేజకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

పవన్‌కుమార్‌కు 78వ ర్యాంకు



పవన్ కుమార్ రెడ్డి (78వ ర్యాంకు)

గాండ్లపెంట: జాతీయ స్థాయిలో నిర్వహించిన 'నీట్'లో 720 మార్కులకు 720 మార్కులు సాధించి ఆలిండియా ఫస్ట్‌ర్యాంక్ సాధించిన పోరెడ్డి పవన్‌కుమార్ రెడ్డి మంగళవారం విడుదలైన ఏపీఈఏపీసెట్‌లోనూ 78వ ర్యాంకుతో సత్తా చాటాడు. గాండ్లపెంట మండల పరిధిలోని పోరెడ్డివారిపల్లికి చెందిన వసంతరెడ్డి, చంద్రకళ దంపతులు రెండో కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి ఇంటర్ కాగానే తొలి ప్రయత్నంలోనే నీట్‌లో సత్తాచాటాడు. అలాగే ఏపీఈఏపీసెట్ రాయగా 78వ ర్యాంకు దక్కించుకున్నాడు.

క్లుప్తంగా

రసవత్తరంగా ఎడ్ల బండ్ల పోటీలు



మొదటి బహుమతిగా రూ.20వేల పారితోషకాన్ని అందుకుంటున్న రైతు కేశవ

నల్లమాడ: మండలంలోని సోమగుట్టపల్లి వద్ద జరుగుతున్న అక్కమ్మ గార్ల (రాజుల) పరషలో భాగంగా మంగళవారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పరుగు పోటీలు రసవత్తరంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి 23 జతల ఎద్దులను పోటీకి రైతులు తీసుకువచ్చారు. నిర్ణయించిన దూరాన్ని తక్కువ సమయంలో చేరుకున్న ఎద్దులను విజేతగా ప్రకటించారు. ఈ క్రమంలో మలకవేమల గ్రామానికి చెందిన కేశవ ఎద్దులు మొదటి స్థానం, గోరంట్ల మండలం బూసేపల్లికి చెందిన భూషణ ఎద్దులు రెండో స్థానం, కొత్తచెరువుకు చెందిన నాగన్న ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. విజేత ఎద్దుల యజమానులను అభినందిస్తూ నగదు పురస్కారాలతో గ్రామ పెద్దలు సత్కరించారు.

13న జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

హిందూపురం టౌన్: ఈ నెల 13న జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్, కార్యదర్శి మహమ్మద్ సలీమ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హిందూపురంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో జరిగే ఎంపికలకు సబ్ జూనియర్ విభాగంలో 2011, జనవరి 1 నుంచి 2012, డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారు అర్హులు. అలాగే జూనియర్ విభాగానికి 2008, జనవరి 1 నుంచి 2010, డిసెంబర్ 31 మధ్య జన్మించి ఉండాలి. క్రీడాకారులు తమవెంట ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 4 ఫొటోలు, పీఈఎంఎ సర్టిఫికెట్, తల్లిదండ్రుల సమ్మతి పత్రం తీసుకెళ్లాలి.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి



పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో మంగళవారం కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి చెందింది. గ్రామ సమీపంలోని పొలాల్లో సంచరిస్తున్న జింకపై ఉన్నఫళంగా వీధి కుక్కలు దాడి చేశాయి. గమనించిన రైతులు కుక్కల బారి నుంచి జింకను కాపాడి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడకు చేరుకుని గాయపడిన జింకకు చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో కాసేపటికే జింక మృతి చెందింది.

ఫోన్ కొట్టు... సాయం పట్టు

- విపత్కర పరిస్థితుల్లో గుర్తుకు వచ్చే టోల్–ఫ్రీ నంబర్లు
- తక్షణ సాయం అందేలా చర్యలు



పుట్టపర్తి టౌన్: నిత్యం ప్రజలకు అనేక సమస్యలు తారసపడుతుంటాయి. సమయానికి సలహా ఇచ్చే వారు కనిపించరు. కనీసం స్పందించేవారు ఉండరు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఒక్క ఫోన్ కాల్ చేస్తే వెంటనే స్పందించేలా ప్రభుత్వం టోల్–ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. క్షేత్రస్థాయిలో ఎదురైన ఇబ్బందులపై వెంటనే సంబంధిత టోల్–ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే ఆగమేఘాలపై సాయం అందుతోంది. పైసా ఖర్చు లేకుండా టోల్–ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందే అంశంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

కాల్ చేస్తే పరిష్కరిస్తారనే నమ్మకం

సమస్య ఏదైనా డయల్ 100కు కాల్ చేస్తే పరిష్కరిస్తారనే నమ్మకం జిల్లా ప్రజల మదిలో నాటుకుపోయింది. సమస్య చిన్నదా? పెద్దదా? అసలు పరిష్కారం అవుతుందా? కాదా? అభ్యంతరకమైన సమస్యకు కూడా కాల్ చేయొచ్చా? లేదా? అనే ఆలోచన లేకుండా టక్కున 100కు కాల్ చేస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి డయల్ 100 సిబ్బంది కూడా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆ ఫిర్యాదును రెఫర్ చేస్తున్నారు. ఫోన్ కాల్ చేసి వ్యక్తి ఎలాంటి విపత్కర పరిస్థితిల్లో ఉన్నారో చెబితే చాలు బాధితులు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకుని మరీ పోలీసులు అక్కడ వాలిపోతుంటారు. అవసరమైతే ఘటనాస్థలానికి చేరుకునేంత వరకూ బాధితులతో ఫోన్‌లో మాట్లాడుతూ వారికి పలు సూచనలు ఇస్తూ ధైర్యం చెబుతారు.

డయల్ 112

మహిళలు మరియు పిల్లల భద్రతకు భరోసా కోసం డయల్ 112 టోల్–ఫ్రీ నంబర్‌తో పాటు యాప్‌నూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశంలోని ఏ ప్రాంతం వారైనా '112'కు డయల్ చేయడం ద్వారా సత్వర పోలీసు, అగ్నిమాపక, అంబులెన్స్ సేవలు అందిపుచ్చుకోవచ్చు. బాధితులు ఏ రాష్ట్రం నుంచి ఫోన్ చేస్తే ఆ రాష్ట్రంలోని పోలీసు కమాండ్ కంట్రోల్ రూంకు కాల్ వెళుతుంది. అలాగే 112 యాప్ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ప్రొఫైల్‌లో పేరు, ఫోన్ నంబర్, పుట్టిన తేదీ, రాష్ట్ర వివరాలు నమోదు చేసుకోవాలి. ఆపద సమయంలో యాప్‌లోని అత్యవసర బటన్ నొక్కితే సమాచారం వెంటనే పోలీసు కమాండ్ కంట్రోల్ రూంతో పాటు అందులో నిక్షిప్తం చేసిన కుటుంబసభ్యులకూ చేరుతుంది. సమీపంలోని గస్తీ పోలీసుల ద్వారా తక్షణ సాయం అందుతుంది.

డయల్ 182

రైలు ప్రయాణంలో ఏదైనా భద్రతా సమస్య తలెత్తితే తక్షణ సాయం కోసం డయల్ 182కి కాల్ చేయవచ్చు. ఆ కాల్ రైల్వే డివిజన్ పరిధిలోని రక్షక దళం కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. కాల్ చేసేవారు రైలు, కోచ్ మరియు రైలు ఉన్న ప్రదేశాన్ని మాత్రమే పేర్కొనాలి. బాధితులు అందించిన వివరాల ఆధారంగా ఆ రైల్లో ఆర్‌పీఎఫ్ సిబ్బంది వెంటనే బోగీలోకి చేరుకుని సాయమందిస్తారు.

9121211100 వాట్సాప్ నంబర్

ఆపదలో ఉన్న మహిళలకు తక్షణ సాయం అందించేందుకు సైబర్ మిత్ర పేరుతో 9121211100 వాట్సాప్ నంబర్‌ను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. సైబర్ నేరాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సైబర్ మిత్ర ఎంతో దోహదపడుతోంది. ఈ నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా అత్యవసర పరిస్థితిల్లో రక్షణ పొందే వెసులుబాటు ఉంది. ఈ నంబర్‌కు వాట్సాప్ ద్వారా లోకేషన్ షేర్ చేస్తూ తాము ఆపదలో ఉన్నామని తెలియజేయవచ్చు. దీని ఆధారంగా పోలీసులు తక్షణమే స్పందిస్తారు.

ఎంసీఏ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న జేఎన్‌టీయూఏ ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూఏఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఈ ఏడాది మేలో నిర్వహించిన ఎంసీఏ నాలుగో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. మొత్తం 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ వెల్లడించారు. తక్కువ సమయంలోనే ఫలితాల విడుదలకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. విష్ణువర్ధన్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, విభాగాధిపతులు డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ ఎం. రామశేఖర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణి రాధ, అజిత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల దుశ్చర్య... గడ్డివామికి నిప్పు



కాలిపోయిన గడ్డివామిని పరిశీలిస్తున్న సీఐ మోహన్

కదిరి అర్బన్: టీడీపీ నేతల దుశ్చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కదిరి మండలం దిగువచెర్లోపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, రైతు పవన్‌కుమార్‌రెడ్డికి చెందిన గడ్డివామికి సోమవారం రాత్రి నిప్పు పెట్టారు. పశువుల మేపు కోసమని తన ఇంటి కాంపౌండ్‌లోనే గడ్డి వామిని రైతు ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం కుటుంబసభ్యులతో కలసి కదపలోని ఆలయంలో మొక్కు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేని విషయం తెలుసుకున్న దుండగులు గుట్టు చప్పుడు కాకుండా నిప్పు పెట్టడంతో రూ.20 వేలు విలువ చేసే పశుగ్రాసం కాలి బూడిదైంది. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు కోసం తాను ప్రచారం చేయడాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నేతలే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారంటూ పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. ఘటనాస్థలాన్ని కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ పరిశీలించారు.

జీజీహెచ్‌లో చిన్నపిల్లల సర్జరీలు ప్రారంభం



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల ఓపీ విభాగం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చిన్న పిల్లల సర్జరీ విభాగం అందుబాటులోకి వచ్చింది. రెండు నెలలుగా ఆస్పత్రిలోని ఈ విభాగం ద్వారా చిన్నారులకు కేవలం వైద్య సేవలు మాత్రమే అందేవి. ఇకపై వారంలో బుధ, శుక్రవారాల్లో ఓపీ సేవలుంటాయి. మిగిలిన రోజుల్లో చిన్నారులకు వైద్య పరీక్షలు, వారంలో ఒక రోజు శస్త్రచికిత్సలు చేసేలా సంబంధిత వైద్యులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే ఈ విభాగానికి ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులో డాక్టర్ చలపతి నియమించారు. ఈయనతో పాటు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లున్నారు. గతంలో పీడియాట్రిక్ సర్జరీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేది కాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ విభాగాన్ని ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. నవజాత శిశువుల్లో అన్నవాహిక సమస్య, ప్రసవ సమయంలో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు ఛాతిలోకి పేగుల వెళ్లడం, కిడ్నీ వాపు, హెర్నియా తదితర అత్యవసర శస్త్రచికిత్సలను అందజేయనున్నారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారుల కోసం ఫిమేల్ సర్జికల్ వార్డులో ఐదు మంచాలను ఏర్పాటు చేశారు. సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన పీడియాట్రిక్ సర్జరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.

జాతీయ రహదారి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపంలోని 44 జాతీయ రహదారిపై ఉన్న క్వాలిటీ రెస్టారెంట్‌కు దగ్గరలో మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రోడ్డు పక్కగా వెళుతున్న వారు దుర్వాసనను పసిగట్టి పరిశీలించడంతో కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పెద్దవడుగూరు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మూడు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు. దాదాపు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, క్రీమ్ కలర్ ప్యాంట్, రెండు షర్టులు ధరించినట్లుగా గుర్తించారు. మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే పెద్దవడుగూరు పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ శ్రీనివాసులు కోరారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

- మూడు నెలల క్రితం ఢీకొన్న ద్విచక్ర వాహనం
- అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స
- పరిస్థితి విషమించి మంగళవారం మృతి



గాయపడిన బాలుడు రామ్‌చరణ్ (ఫైల్)

రాయదుర్గం రూరల్: మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ బాలుడు... ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం 74 ఉడేగోళం గ్రామానికి చెందిన సోమరాజు, ఇందిరమ్మ దంపతుల కుమారుడు రామచరణ్ (15) ఈ ఏడాది మార్చిలో అదే గ్రామంలో రోడ్డు దాటుతుండగా కెంచానపల్లికి చెందిన వన్నూరుస్వామి ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న రామచరణ్‌ను కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం బళ్లారిలోని విమ్స్‌కు అక్కడి నుంచి బెంగళూరులోని ఇందిరాగాంధీ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న రామచరణ్ పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ జీడీ వెంకటరమణ తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మి రథోత్సవం



కొల్లాపురి మహాలక్ష్మి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని తారకాపురం గ్రామంలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవం మంగళవారం సాయంత్రం గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం గంగా జలంతో అమ్మవారిని అభిషేకించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 101 మంది గోరవయ్యల నృత్యం, నందికోలు, వీరభద్ర కుణిత, మహిళా వీరకాశి నాట్యాల మధ్య రథోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్ విగ్రహంపై రాళ్లు, రాడ్లతో దాడి

పెద్దపప్పూరు: మండలంలోని వరదాయపల్లిలో టీడీపీ కార్యకర్తలు దుశ్చర్యకు పాల్పడ్డారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహంపై మంగళవారం సాయంత్రం రాడ్లు, రాళ్లతో దాడికి తెగబడ్డారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి డీఎస్పీ జనార్దననాయుడు, యాడికి సీఐ రోషన్, పెద్దపప్పూరు పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకోవడంతో టీడీపీ కార్యకర్తలు పరారయ్యారు. దాడిలో విగ్రహం పాక్షికంగా దెబ్బతిన్నట్లు పోలీసులు గుర్తించారు. విధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.

14న జిల్లా జైలు ఆదాయ వనరుల వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా జైలులో ఆదాయ వనరులపై ఈ నెల 14న వేలం పాట నిర్వహించనున్నారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ రెహమాన్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 25 వేల కిలోల వేరుశనగ చెక్కకు నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనే వారు రూ.22 వేల ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. వేలం పాట ముగిసిన తర్వాత డిపాజిట్ సొమ్ము వెనక్కి చెల్లిస్తారు.

తలపై చెట్టు కొమ్మ పడి వృద్ధుడి మృతి



మృతుడు రామలింగ

ఉరవకొండ: చెట్టు కొమ్మ విరిగి తలపై పడడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం పెద్దకౌకుంట్లకు చెందిన రామలింగ (70)కు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న రామలింగ మంగళవారం ఉదయం గ్రామంలోని రచ్చకట్ట వద్ద ఏర్పాటు చేసిన కొళాయి వద్దకు నీరు తాగేందుకు వెళ్లాడు. అప్పటికే గాలి, వాన ప్రారంభం కావడంతో కట్ట మీద కూర్చొన్న ఒక్కొక్కరూ ఇంటి దారి పట్టారు. అదే సమయంలో బలమైన గాలి వీచడంతో కట్ట సమీపంలోని వేప చెట్టుకు ఉన్న పెద్ద కొమ్మ విరిగి రామలింగ తలపై పడింది. తీవ్రమైన రక్తగాయమైన రామలింగను స్థానికులు 108 అంబులెన్స్ వాహనం ద్వారా ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ రాజీనామా

పెనుకొండ రూరల్: రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు వాల్మీకుల అభ్యున్నతి కోసం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 2023, జులై 19న ఆ కార్పొరేషన్‌కు రాష్ట్ర చైర్మన్‌గా రామచంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో కార్పొరేషన్‌ల కో ఆర్డినేటర్ పులివెందుల ప్రవీణ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన తన పదవికి రాజీనామా చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

నగదు అపహరణ

తాడిపత్రి అర్బన్: వ్యక్తిగత పనులపై పట్టణానికి వచ్చిన ఓ వ్యక్తి నుంచి రూ.60 వేల నగదును దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు తన తల్లికి సంబంధించిన పెన్షన్ డబ్బును బ్యాంకులో డ్రా చేసుకునేందుకు మంగళవారం ఉదయం తాడిపత్రికి వచ్చాడు. బ్యాంకులో నగదు డ్రా చేసుకున్న అనంతరం సీబీ రోడ్డులోని ఓ చెప్పుల దుకాణంలోకి వెళ్లి నగదు బ్యాగ్‌ను పక్కనే ఉంచుకుని చెప్పుల కొనుగోలు చేశాడు. అనంతరం బ్యాగ్ కోసం చూడగా కనిపించలేదు. వెంటనే బయటకు వచ్చి చూశాడు. తన ద్విచక్ర వాహనానికి ఉన్న ఫ్లగ్‌ను కూడా దుండగులు తొలగించినట్లు గుర్తించి ఫిర్యాదు చేయడంతో అర్బన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేసేపేటలో వెలసిన వరలక్ష్మీదేవి, సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయ గోపుర కలశాలకు భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహా గణపతి పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. బుధవారం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు నిశ్చితార్థం, 13న కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



కలశాలను తీసుకెళ్తున్న మహిళలు

లక్కుంటే రాయి కూడా వజ్రమే



వజ్రాల కోసం అన్వేషిస్తున్న దృశ్యం



దొరికిన రాళ్లను పరిశీలిస్తున్న వృద్ధుడు

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరు పరిసర ప్రాంతాల్లో వజ్రాల వేట ఊపందుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం ఉదయం జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి కార్లు, ద్విచక్రవాహనాలపై వేలాదిగా అన్వేషకులు తరలి వచ్చి వజ్రకరూరు పొలాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వజ్రమని అనుమానించే ప్రతి రాయిని ఎంతో భద్రంగా తీసి దాచుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పొలాల్లోనే వజ్రాల కోసం అన్వేషణ కొనసాగించారు. స్థానికంగా ఉన్న కొందరు చిరు వ్యాపారులతో పాటు జిల్లా, ఇతర జిల్లాలో ఉన్న బడా వ్యాపారులు సైతం గుట్టు చప్పుడు కాకుండా తమ ఏజెంట్లను రంగంలో దించి అన్వేషకులపై ప్రత్యేక నిఘా ఉంచారు.

అంతరిస్తోన్న 'అలుగు'

- జీవ వైవిధ్యంలో విలువైన క్షీరదం
- పూర్తిగా కనుమరుగైతే రైతులకు నష్టం
- సంరక్షించాలని శాస్త్రవేత్తల పిలుపు



అలుగు

అనంతపురం: జీవ వైవిధ్య పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తూ, రైతులకు సాయం చేసే అరుదైన జీవ జాతికి చెందిన 'అలుగు' ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంతరించిపోతోంది. 10 సంవత్సరాల్లో ఈ జాతి సంతతి సుమారు 30 శాతం క్షీణించింది. శ్రీ సత్యసాయి జిల్లా కాళసముద్రం, కదిరి, బత్రేపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో చేపట్టిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది.

వింతైన ఆకారం..

అలుగు అనేది ఒక క్షీరదం. శాస్త్రీయ నామం మానిస్ క్రాసికౌడొటా. చీమలు, చెదపురుగుల పుట్టలను తవ్వి కీటకాలను తింటుంది. వీటి దవడలకు దంతాలు ఉండవు. పాశ్చాత్య దేశాల్లో స్కేలీ యాంటియేటర్ అని పిలుస్తారు. ప్రాంతీయంగా అలుగు అంటారు. అలుగు స్వరూపం చాలా వింతగా ఉంటుంది. చిన్నతల, గొట్టపు రూపం కలిగిన నోరు, చిన్నకళ్లు, చెవులు, చర్మంలో చీలికలు, బాహ్య చెవి డొప్ప తో కనిపిస్తాయి. ముఖం, ఉదర భాగం మినహాయించి దాని శరీరం పసుపు రంగు పొలుసులతో కప్పబడి ఉంటుంది. దీని ముక్కు మూసుకుపోయేలా చేసే కవాటాలతో పాటు పెద్ద నాసికా రంధ్రాలను కలిగి ఉంటుంది. దీని నాలుక పొడవుగా, జిగటగా ఉంటుంది.

ఉపయోగాలెన్నో..

అలుగు క్రమేణా తగ్గిపోతుండడంతో జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతోంది. రైతు మిత్రగా పేరు సంపాదించుకున్న ఈ క్షీరద సంతతి తగ్గితే కీటకాలు పెరుగుతాయి. దీంతో ఆ ప్రభావం పంటల దిగుబడిపై పడి రైతులకు నష్టం జరుగుతుంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. రైతులకు ప్రత్యక్షంగా ఎంతగానో ఉపయోగపడుతున్న అలుగు అంతరించకుండా చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

కారణాలివే..

ఎడారీకరణ, తక్కువ వర్షపాతం, అడవుల నరికివేత, ఆవాసాలు కోల్పోవడం, నేలకోత, భూమి క్షయం, వ్యవసాయ విస్తరణ, అతిగా జీవాల పెంపకం, పెరుగుతున్న పట్టణీకరణ, అడవుల్లో కార్చిచ్చు తదితర కారణాలతో అలుగు సంతతి తగ్గిపోతోంది.

అత్యధికంగా అక్రమ రవాణా



ప్రపంచంలోనే అత్యధికంగా అక్రమ రవాణా జరుగుతున్న క్షీరదం అలుగు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో వాటి పొలుసులు, తోలును బూట్లు, బ్యాగుల తయారీలో ఉపయోగిస్తున్నారు. ఆసియాలో కనిపించే నాలుగు జాతులు ఇండియన్ పాంగోలిన్ (మానిస్ క్రాసికౌడాటా), ఫిలిప్పైన్ పాంగోలిన్ (మానిస్ క్యులియోనెన్సిస్), సుండా పాంగో లిన్ (మానిస్ జవానికా), చైనీస్ పాంగోలిన్ (మానిస్ పెంటాడక్టిలా). అంతరించిపోతున్న జాతుల జాబితాలో అలుగును చేర్చారు. ఐయూసీఎన్ (అంతర్జాతీయ జీవ వైవిధ్య సంస్థ) రెడ్‌లిస్ట్‌లో చేర్చిన ఈ అలుగు పరిరక్షణకు నడుం బిగించాలి. గత 10 సంవత్సరాల్లో జిల్లాలో ఏకంగా 30 శాతం ఈ క్షీరద జాతి క్షీణించినట్లు పరిశోధనల్లో వెల్లడైంది.

– డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, జువాలజీ టీచింగ్ అసిస్టెంట్, పరిశోధకులు, ఎస్కేయూ